


# వెరతు వెరతు...

# అన్నమయ్య పదాలు సామాజిక దృక్పథాలు

శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల వారి పేరు వినగానే చప్పున స్ఫురించేవి ఆయన తిరువేంకటేశుని పాదాలపై నుంచిన భక్తి పదాలూ, అలిమేలుమంగా సమేత శ్రీనివాసునిపై వెదజల్లిన శృంగార పదాలూ! అన్నామాచార్యుడు తొలి వాగ్గేయకారుడే కాదు, జానపదాలకి బ్రహ్మ రథం బట్టి జనపథం వైపు మరలించిన మహా కవి! అన్నమయ్య పదాలలో భక్తి భావం తెలుగు సాహిత్య పరిమళాన్ని ఆవిష్కరించే పారిజాత సుమరజం! అన్నమయ్య భక్తి భావంలో పులకరించినా, శృంగార పదాలలో తడిసినా పదాలలో కనిపించేది ఒక కవి హృదయ స్పందన,చలించే మనసుపడే వేదన!

ఒక ఆర్ద్రవ భావం కవిని వహిస్తే ఓ రస ఝరిలా హృదయాంతరాళాల్లోంచి ప్రవహించే ఓ సజీవ స్పందనా శిల్పం!

కేవలం శృంగారం, భక్తి తత్వమే కాకుండా, తాను చుట్టూ ఉన్న మనుషులు, వారి మధ్య సంఘటనలపైన కూడా రాసిన అనేక పదాలు ఉన్నాయి. కొన్ని పదాలు విప్లవాత్మకంగా అనిపిస్తాయి కూడా.

దిగువ చూపబడిన ఓ కీర్తన చూస్తే ఓ కవి హృదయవేదన స్పష్టంగా తెలుస్తుంది. ఆ కీర్తన గురించి ప్రస్తావించే ముందు ఏ సందర్భంలో, ఏ సంఘటన చూస్తే అన్నమయ్య లోని కవి స్పందించాడో తెలుసుకుంటే కీర్తన భావం హృదయాలకి హత్తుకునే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

క్రీ.శ. 1420 సంవత్సరంలో విజయనగరాన్ని విరూపాక్ష చంద్రశేఖర రాయలు పాలించే వాడు. విరూపాక్ష మహారాజు విలాస పురుషుడు.

ఓ సారి కపిలేస్వర గజపతి విరుపాక్షునిపై దండెత్తి వచ్చాడు. యుద్ధంలో చచ్చీ చెడీ విజయం సాధించినా అతని పెద్ద కొడుకు రాజశేఖరుని చేతిలో హత్య గావించబడ్డాడు. రాజశేఖరుణ్ణి అతని తమ్ముడు రెండవ విరూపాక్షరాయలు చంపించాడు. కాని అన్నగారిపై హత్యని విజయనగర వాసులు మెచ్చలేదు సరికదా, అతనికి ఎదురు తిరిగారు. ఇదే అదను చూసుకొని అతని దండనాయకుడు సాళువ నరసింహరాజు ప్రజల మద్దత్తు తీసుకొని రాజ్యాన్ని ఆక్రమించుకొన్నాడు. ఈ నరసింహరాయలు అన్నమయ్యని విజయనగరం పిలిచాడు. విజయనగరం లో జరిగే రాజ్యోప విప్లవాలను తెలుసుకొన్నాడు. అక్కడి

సామంత రాజుల దౌర్జన్యాలను కొన్ని కళ్ళారా చూసి చలించి పోయాడు. రాజ్యాధికారం కోసం రాజులు తండ్రినీ, అన్నలనీ, తమ్ముళ్ళనీ, ఆఖరికి కొడుకులనీ హత్య చేసే దుర్గతి చూసి హద్దులు దాటిన మానవత్వపు విలువలు వివరించాడు. ఆ బాధనంతా పదాలలో బంధించి గొంతెత్తి విలపించాడు.

వెరతు వెరతు నిండు వేడుకపడ నిట్టి -
కురుచ బుద్ధుల నెట్టు గూడుదనయ్య
||పల్లవి||

దేహమిచ్చిన వాని దివిరి చంపెడివాడు
ద్రోహి గాక నేడు దొరయట
ఆహికముగ నిట్టి అధమ వర్తికి - నే
సాహసమున నెట్టు చాలుదనయ్య
||వెర||

భయోత్పాతకమైన నీచాతి నీచమైన కురుచ బుద్ధులతో నిండిన ఈ సంఘటనలనెలా జీర్ణించుకొనేది? తనువు నిచ్చిన తండ్రిని చంపే వాడిని ద్రోహిగా చూడకుండా దొరలా సింహాసనంపై ఎక్కడం న్యాయమా అంటూ గొంతెత్తి చెప్పాడు.
ఒకరి కాళ్ళ కింద చాపలాగి వారిని చంపే సాహసం అధమ వృత్తి కాక ఏమవుతుంది?
ఇంకా ఈ పదాలు చూడండి.

తోడ బుట్టినవాని దొడరి చంపెడువాడు
చూడ దుష్టుడు గాక సుకృతియట
పాడైనటువంటి పాప బుద్ధులు సేసి
నీడ నిలువ నెట్టు నేరుతునయ్య
||వెర||

తోడ బుట్టిన అన్ననీ, తమ్ముళ్ళనీ చంపే రాజులు దుష్టులు కదా, వారిని దర్శించుకోవడానికి ప్రజలు రావడం ఎంత విడ్డూరం? ఇటువంటి పాప బుద్ధులున్న రాజుల నీడన ఎలా బ్రతికేది?

కొడుకు నున్నతమతి గోరి చంపెడివాడు
కడుబాతకుడు గాక ఘనుడట
కడలేని ఇటువంటి కలుషవర్తికి నాత్మ
నొడబరపగ నెట్లోపుదునయ్య
||వెర||

పుత్రుల అభివృద్ధి చూసి సంతోషించవలసిన తండ్రే, కొడుకుని చంపితే పాతకుడుగా పరిగణించక, ఘనుడంటూ పొగడడం న్యాయమా? ఇలాంటి కలుషితమైన పని చేయడానికి మనస్సెలా వచ్చింది?

తల్లి జంపెడువాడు తలప దుష్టుడు గాక
యెల్లవారల కెల్ల నెక్కుడట
కల్లరి యనుచు లోకము రోయు పని ఇది
చెల్లబో నే నేమి సేయుదునయ్య
||వెర||

ఇంటి వేలుపు వేంకటేశ్వరు దనవెంట -
వెంట దిప్పెడువాడు విభుడట
దంటనై యాతని దాసానుదాసినై
నొంటి నుండెద నేమి నొల్ల నయ్య
||వెర||

జన్మనిచ్చిన తల్లిని చంపే దుష్టుడిని శిక్షించాల్సిందిపోయి ఘనుడంటూ నెత్తికెక్కించుకోవడం సరియా? దుష్ట కార్యాన్ని ఖండిచాల్సిన ప్రజలే నిమ్మకు నీరెత్తినట్లు నోరు మూసుకుంటే నాలాంటి సామాన్యుడు ఏమి చెయ్యగలడు, వేంకటేశుని పాదాలపై బడి అతనిని శరణు వేడడం తప్పు? అంటూ కన్నీరు

కార్చాడు అన్నమయ్య! బాధపడడమే కాదు, తన పదాలలో వారి తప్పుడు పనుల్నీ, దుశ్చర్యల్నీ నిర్మొహమాటంగా, నిర్భీతిగా చెప్ప గలగడం కవి గా అన్నమయ్య సాహసం చేసాడనే చెప్పవచ్చు.

తప్పుని ఖండించడానికి ధైర్యమొక్కటే కాదు లోతైన హృదయమూ, పదునైన భావం ఉంటే చాలంటూ ఈ పదాలు అన్నమయ్యలోని కవితా దృక్పథాన్ని చాటి చెబుతాయి. విప్లవమంటే నెత్తురు కవిత్వం కాదు అన్న ఈ అన్నమయ్య పదాల స్పూర్తి రథం, విప్లవ ఉద్యమాలని నిర్వచించే సరికొత్త దృక్పథం అనడంలో సందేహం లేదు.

